**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 30.03.2026** **సమయం : 18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. రాష్ట్రంలో ఆహార కల్తీని అరికట్టేందుకు కట్టుదిట్టమైన విధానాన్ని రూపొందించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు.
2. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికి భారత ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ ఈ రోజు ఏకగ్రీవంగా తీర్మానించింది.
3. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం కల్పించే ప్రక్రియలో ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు.
4. తెలంగాణ శాసనమండలిలో బిఆర్ఎస్ సభ్యుల గందరగోళం నేపథ్యంలో సభ నుంచి ఆ పార్టీ సభ్యులను ఈ రోజు ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సస్పెండ్ చేశారు.

**.......................................................**

**కాగ్ నివేదిక**

రాష్ట్ర శాసనసభలో ప్రభుత్వం కాగ్ నివేదికను ప్రవేశపెట్టింది. మార్చి 2022తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి.. సామాజిక, ఆర్థిక, సాధారణ రంగాలతో పాటు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంపై కాగ్ కీలక అంశాలను వెల్లడించింది. ప్రభుత్వ నిర్వహణ లోపాల కారణంగా కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందని నివేదికలో స్పష్టం చేసింది.

ముఖ్యంగా బడ్జెట్ రూపకల్పనలో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయని కాగ్ పేర్కొంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో నిధుల కేటాయింపులు, వాస్తవ రాబడుల మధ్య ఏకంగా 53 శాతం వ్యత్యాసం ఉందని పేర్కొంది. అలాగే 2019-20, 2020-21 బడ్జెట్ నిర్వహణ కూడా సక్రమంగా లేదని విమర్శించింది. బ్యాంకులతో సరైన సమన్వయం, పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లిందని నివేదిక పేర్కొంది. 2023 నాటికి చెక్కులు, డ్రాఫ్టులను సకాలంలో జమ చేయనందున సుమారు 52 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని కాగ్ వివరించింది.

......పిటిసి, హైదరాబాద్

**రేవంత్ రెడ్డి**

రాష్ట్రంలో ఆహార కల్తీని అరికట్టేందుకు కట్టుదిట్టమైన విధానాన్ని రూపొందించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ, ఇక్రిసాట్ నిపుణులతో కలిసి ఒక టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. సన్నబియ్యం పథకం ప్రవేశ పెట్టి యేడాది పూర్తయిన సందర్భంగా ఈరోజు అసెంబ్లీ ఆవరణలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిట్ చాట్ నిర్వహించారు. సన్నబియ్యం పథకానికి ప్రతియేటా 14వేల 560 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ఒక కోటి 5లక్షలకు పైగా రేషన్ కార్డులు ఉన్నాయని, 3కోట్ల 39 లక్షల మంది లబ్దిదారులు ఉన్నారని చెప్పారు. సన్నబియ్యం పండించే రైతులకు రైతు భరోసా సాయంతో పాటు అదనంగా బోనస్ కూడా అందిస్తున్నామన్నారు. ఆ సన్న బియ్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రేషన్ కార్డు దారులకు అందజేస్తోందని, ఫలితంగా రైతులకు, మిల్లర్లకు, రేషన్ కార్డు లబ్దిదారులకు ప్రయోజనం కలిగేలా చూస్తున్నామన్నారు. సన్నబియ్యం పథకం వల్ల రైతులకు లబ్ది చేకూరుతోందని, ఆ బియ్యాన్ని పేదలకు అందిస్తున్నామని, దళారీ వ్యవస్థ లేకుండా పోయిందని ముఖ్యమంత్రి వివరించారు.

భవిష్యత్తులో రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు.. ఇతర నిత్యావసరాలు కూడా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోందన్నారు. రాష్ట్రంలో పంట మార్పిడి అవసరమని, అయితే, బలవంతంగా చేయించబోమని, రైతుల్లో పంట మార్పిడిపై అవగాహన కల్పించి స్వచ్ఛందంగా నిర్ణయం తీసుకునేలా చేస్తామన్నారు. దక్షిణ, ఉత్తర భారత దేశం మధ్య అంతరం లేకుండా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

- ఎంఎస్ఎం

**జూపల్లి కృష్ణారావు**

రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆయన లేఖ రాశారు. శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులకు స్వయంగా జూపల్లి కృష్ణారావు లేఖలను అందజేశారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సమీపంలోని పర్యాటక ప్రదేశాలను కనీసం రెండు రోజుల పాటు సందర్శించాలని, ఆ ప్రదేశాల విశిష్టత, అనుభవాలను ప్రజలకు వివరించి పర్యాటకులను ప్రోత్సహించాలని కోరారు.

.....డెస్క్

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు సస్పెండ్**

తెలంగాణ శాసనమండలి నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు సస్పెండ్ అయ్యారు. మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, తాతా మధు సహా బీఆర్ఎస్ సభ్యులను చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సస్పెండ్ చేశారు. అక్రమ మైనింగ్ వ్యవహారంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు చేపట్టిన నిరసన చివరకు వారి సస్పెన్షన్‌కు దారితీసింది. రాఘవ కన్స్ట్రక్షన్ అక్రమాలపై సభా సంఘం వేయాలని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులతో చైర్మన్ పోడియంను చుట్టుముట్టారు. సభ సజావుగా సాగేందుకు

సహకరించాలని ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు పదే పదే విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే సీఐడీ విచారణకు ఆదేశించినట్లు ప్రభుత్వం స్పష్టం చేసినప్పటికీ, ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళనను విరమించలేదు. సభా సమయాన్ని వృథా చేస్తున్నారన్న కారణంతో, మంత్రి శ్రీధర్ బాబు ప్రవేశపెట్టిన తీర్మానం మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు.

.........డెస్క్

**అసెంబ్లీలో మధ్యాహ్న భోజనం**

తెలంగాణ రాష్ట్రంలో పేదలకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా శాసనసభ భవనంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం వడ్డించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి భోజనం చేశారు.

.... PTC HYD

**గవర్నర్ కు ఫిర్యాదు**

వట్టినాగులపల్లి భూముల వ్యవహారంపై పూర్తి ఆధారాలతో గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారకరామారావు తెలిపారు. వట్టినాగులపల్లిలో అసైన్డ్ భూములను కబ్జా చేస్తున్నారని, వందల కోట్ల రూపాయల విలువైన ప్రజా సంపదను కొల్లగొడుతున్నారని ఆరోపణలు చేశారు. రాఘువ కన్‌స్ట్రక్షన్ కంపెనీ గత రెండేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ సాగిస్తోందని, దీనిపై ప్రభుత్వం మంత్రిని కాపాడే ప్రయత్నం చేస్తోందని అన్నారు. మంత్రి పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలని, అక్రమాలపై అసెంబ్లీలో సభా సంఘం వేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించినందుకు తమ పార్టీ సభ్యులను సస్పెండ్ చేస్తున్నారని, సీబీసీఐడీని అడ్డుపెట్టుకుని విచారణను నీరుగారుస్తున్నారని కేటీఆర్ విమర్శించారు.

......PTC HYD

**లోక్ భవన్**

క్యాన్సర్ ప్రిలిమనరీ స్క్రీనింగ్ కోసం భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సమకూర్చిన మొబైల్ వ్యాన్ ను గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా...లోక్ భవన్ ప్రాంగణంలో జెండా ఊపి ప్రారంభించారు. మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని ప్రజలకు సేవలందించేందుకు ఈ మొబైల్ యూనిట్ ను ఉపయోగిస్తారు. ఈ వ్యాన్ లో క్యాన్సర్ నిర్ధారణ ప్రాథమిక వైద్య పరీక్షలు చేస్తారు. CSR నిధులతో మొబైల్ యూనిట్ ను సమకూర్చిన BDL ప్రతినిధులను, క్యాన్సర్ ప్రిలిమనరీ స్క్రీనింగ్ వ్యాన్ ఏర్పాటుకు చొరవ తీసుకున్న ఎంపీ రఘునందన్ రావును గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అభినందించారు.

....డెస్క్

**శాసనసభ తీర్మానం**

పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికి భారత ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఇరాన్, ఇజ్రయిల్ మధ్య మొదలైన యుద్ధం అనేక రూపాంతరాలు చెంది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తోందని ఆయన అన్నారు. ఇప్పటికీ యుద్ధాన్ని ఆపకపోతే మూడో ప్రపంచ యుద్దానికి కూడా దారితీయవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని యుద్దాన్ని ఆపడానికి, ప్రపంచ శాంతిని నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు.

**బైట్ భట్టి విక్రమార్క ………**

ఈ తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

…….పీఎన్

**రహదారుల నిర్మాణం**

రాబోయే మూడేళ్లలో 70 వేల కోట్ల రూపాయల వ్యయంతో రహదారుల నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి శాసనసభలో ప్రకటించారు. హైదరాబాద్-విజయవాడ ప్రయాణాన్ని 3 గంటలకు తగ్గించేలా

10 వేల 410 కోట్ల రూపాయలతో 8 లైన్ల విస్తరణ పనులు మే మొదటి వారంలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా మచిలీపట్నం పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి రానుందని... మరోవైపు శ్రీశైలం భక్తుల కోసం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ మీదుగా 52 కిలోమీటర్ల మేర దేశంలోనే అతిపెద్ద ఎలివేటెడ్ కారిడార్ ని నిర్మించనున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

.......PTC HYD

**వ్యాట్ సవరణ బిల్లు**

తెలంగాణ వ్యాల్యూ ఆడెడ్ టాక్స్ మోబిలిటీ సవరణ బిల్లు–2026ను శాసన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై సభలో విస్తృత చర్చ జరిగింది. ఇందన విక్రయాలలో పన్ను లొసుగులను అరికట్టడం, ఖజానాకు రావాల్సిన పన్ను వాటాను సక్రమంగా రాబట్టడం, రాష్ట్ర ఆదాయాన్ని పెంపొందించే లక్ష్యంతో సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టినట్లు మంత్రి వివరించారు.

....PTC HYD

**పరిశీలన**

హైదరాబాద్... బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద జరిగే ఫ్లైఓవర్ పనులను చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ తో కలిసి జీహెచ్‌ఎంసీ కమిషన ఆర్ వి కర్ణన్ పరిశీలించారు. మొత్తం 6 పియర్ ఫౌండేషన్‌ల తవ్వకాలు పూర్తయ్యాయని, అందులో 3 పియర్‌లకు పీసీసీ బెడ్ పనులు పూర్తయ్యాయని అధికారులు కమిషనర్ కు తెలిపారు. రాఫ్ట్ ఫౌండేషన్‌ల కోసం స్టీల్ ఫ్యాబ్రికేషన్ పనులు రేపు ప్రారంభం కానున్నాయి . ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా పనులు సాగుతున్న తీరుపట్ల కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

......పిటిసి, హైదరాబాద్

**మిడ్ మానేరు నీరు విడుదల**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మన్వాడ వద్ద మిడ్ మానేరు నుంచి దిగువకు నీటి విడుదల చేసినట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ఎల్ఎండీకి 15 వందలు, కుడి కాలువకు 550, ఎడమ కాలువకు 5 క్యూసెక్కుల మేర నీరు వదులుతున్నామన్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టులో నీటిమట్టం 10.71 టీఎంసీలకు చేరిందని తెలిపారు.

.....PTC -రాజన్న సిరిసిల్ల జిల్లా

**నిజామాబాద్ TNGO**

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి TNGO ప్రతినిధులు కృషి చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఇవాళ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. వేసవి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ఉద్యోగులకు ఉపశమనం కల్పించేందుకు వీలుగా తాగునీటితో పాటు ఉచితంగా అంబలి పంపిణీకి చొరవ చూపడం అభినందనీయమని టీఎన్జీఓ సంఘాన్ని కొనియాడారు.

....PTC - నిజామాబాద్

**హాస్టళ్లకు ఫ్రీజర్లు అందజేత**

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని... రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ అన్నారు. జిల్లాలోని 13 కేజీబీవీలు, 7 టీజీఎంఎస్ హాస్టళ్లకు 20 ఫ్రీజర్లను జిల్లా విద్యాశాఖ అధికారి జగన్ మోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ గరిమ అగర్వాల్ పంపిణీ చేశారు. పాలు, ఆకు కూరలు, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలు పాడైపోకుండా నిల్వ చేసుకునేందుకు, విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహార పదార్థాలను అందించేందుకు ఫ్రీజర్లను ఆయా రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్ల నిర్వాహకులకు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు.

.....PTC - రాజన్న సిరిసిల్ల జిల్లా

**యాదాద్రి హుండీ ఆదాయం**

యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని ఇవాళ అధికారులు లెక్కించారు. కోటి 52 లక్షల  ఒక వేయి 420 రూపాయల హుండీ ఆదాయం నమోదైంది.  మిశ్రమ బంగారం 54.5 గ్రాములు, వెండి 2 కిలోలు 700 గ్రాములను భక్తులు కానుకలుగా సమర్పించుకున్నారు. అమెరికా, ఇంగ్లాండ్, కెనడా, ఆస్ట్రేలియా, సౌదీ అరేబియా, ఖతార్ తదితర దేశాల కరెన్సీని కూడా భక్తులు కానుకలుగా స్వామివారి భక్తులు సమర్పించారు.

..........PTC - యాదాద్రి భువనగిరి

**గ్రామ, వార్డు సభలకు ఏర్పాట్లు**

ఏప్రిల్ 2న గ్రామ పంచాయతీలలో నిర్వహించనున్న గ్రామ సభలు, మున్సిపాలిటీలలో నిర్వహించనున్న వార్డు సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి.. అధికారులను ఆదేశించారు.  ప్రజావాణి అనంతరం ..ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక.. 99 రోజుల కార్యాచరణలో భాగంగా అధికారులకు పలు అంశాలపై కలెక్టర్ కీలక సూచనలు చేశారు. ముందస్తుగానే గ్రామ/వార్డు సభల వేదికలను సందర్శించి క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని, పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లతో సమావేశమై తగు సూచనలు చేయాలని ఆదేశించారు.

......పిటిసి, నిజామాబాద్